తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలకసంస్థ పరిధిలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో రిజర్వాయర్ నుంచి టెయిల్ ఎండ్ పాయింట్ వరకు క్లోరిన్ శ్యాంపిల్స్ తీయాలని చెప్పారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 20 ఫిర్యాదులు స్వీకరించారు. పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. ప్రతి విభాగంలో పీజీఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని కోరారు. పీజీఆర్ఎస్‌కు 28 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 15, ఇంజినీరింగ్ విభాగానికి 6, రెవెన్యూ విభాగానికి 3, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలి..

గుంటూరు నగరంలో డ్రెయినేజీ వ్యవస్థకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ ఐటీసీ వెల్కం హోటల్ పరిసరాలు, విద్యా నగర్, జీఎంసీ ప్రధాన కార్యాలయం, కొత్తపేట జంక్షన్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లను, రోడ్ల పక్కన ఆక్రమణలను పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం నీరు డ్రెయిన్లలోకి వెళ్లడానికి వీలు లేకుండా నిర్మాణం చేసిన ఆక్రమణలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టం చేశారు. ఇప్పటికే ఏఈల వారీగా అవసరమైన ప్రాంతాల్లో ప్రైవేట్‌గా ఆయిల్ ఇంజిన్లను ఏర్పాటు చేసుకొని నీటిని బెయిల్ అవుట్ చేయాలని సూచించారు. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నీటి నిల్వపై ఫిర్యాదులు అందుతున్నాయని హెచ్చరించారు. డీఈఈలు వర్షం నీటి బెయిల్ అవుట్‌పై దృష్టి సారించాలన్నారు. నవభారత్‌నగర్ మెయిన్‌రోడ్ నుంచి గుజ్జనగుండ్ల శేషయ్య హాస్పిటల్ వరకు రోడ్ మీద నుంచి నీరు డ్రెయిన్‌లోకి వెళ్లడానికి ఒక అడుగు వెడల్పుతో వెంట్‌లు ఏర్పాటు చేయాలని డీఈఈని ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్తుతుల దృష్ట్యా పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాం ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రీన్ గ్రేస్‌లో ఘనంగా ఇంజినీర్స్ డే



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ డైరెక్టర్లు, ప్రాజెక్టు మేనేజర్ తదితరులు

బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ ఎండీ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): గుంటూరు పట్టాభిపురంలోని బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ కంపెనీ గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టు ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ 1861 సెప్టెంబర్ 15న విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటా దేశ వ్యాప్తంగా ఇంజినీర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఇంజినీరింగ్ రంగంలో అసాధారణ ప్రతిభతో అత్యున్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని చాటిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య భరత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ అని అన్నారు. విశ్వేశ్వరయ్య క్రమశిక్షణ, సమాజానికి చేసిన సేవలను నేటి యువత అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ డైరెక్టర్లు సిద్దినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, ప్రాజెక్టు మేనేజర్ దుర్గై, పలువురు ఇంజినీర్లు, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు



పద్మలతను అభినందిస్తున్న లలిత్‌కుమార్ జైన్



అవార్డు అందుకుంటున్న రత్నబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: అధ్యాపకులు భావితరాల నిర్మాతలని, దేశ ప్రగతిలో వారి పాత్ర కీలకమని శ్రీమహావీర్ మెమోరియల్ జైన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ లలిత్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. నల్లచెరువు మెయిన్‌రోడ్డులోని మహావీర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్న కిలారి శ్రీపద్మలత ఉపాధ్యాయ దినోత్సవం రోజున పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు అందుకున్న సందర్భంగా సోమవారం కళాశాలలో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అంజయ్య పాల్గొన్నారు.

ఐకానిక్ అవార్డు అందుకున్న రత్నబాబు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపూజిత స్కూల్లో పని చేస్తున్న సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు జాలాది రత్నబాబు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాన్ ఇండియా ఐకానిక్ అవార్డు అందుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి తెలిపారు. సోమవారం పట్టాభిపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రత్నబాబును సన్మానించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడాంశాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో అనేక పతకాలు రావడం వెనుక ఆయన కృషి ఉందన్నారు.

సురవరం సుధాకరరెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నెహ్రూనగర్: భారత కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ కార్యదర్శిగా, పార్లమెంట్ సభ్యునిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అమరులైన సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తితో పని చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గుంటూరులోని వేములపల్లి శ్రీకృష్ణ హాలులో సురవరం సుధాకర రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సురవరం సుధాకరరెడ్డి నిరంతర అధ్యయన శీలి అని పదవుల్లో ఉన్న లేకపోయినా ఒకే విధంగా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ ఉషారాణి సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: గుంటూరు మెడికల్ కాలేజ్ ఫార్మకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేసి ప్రొఫెసర్‌గా పదోన్నతిపై కర్నూలు మెడికల్ కాలేజీకి వెళుతున్న డాక్టర్ ఉషారాణికి సోమవారం కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి. సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, ఫార్మకాలజీ వైద్యులు ఘనంగా సత్కరించారు. ఫార్మకాలజీ విభాగంలో ఆమె చేసిన సేవలను కొనియాడారు.

ఇదేనా మంచి ప్రభుత్వం



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన

- ఉద్యోగ, ఉపాధ్యాయులు నిలువునా ముంచారు
- ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

గుంటూరు ఎడ్యుకేషన్: మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఏపీటీఎఫ్ నాయకులు ఆరోపించారు. ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలపై కూటమి ప్రభుత్వం సాచివేత ధోరణిని నిరసిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం చేపట్టిన నిరసన వారం ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం బ్రాడీపేటలోని గుంటూరు పశ్చిమ తహసీల్దార్ ప్రాంగణంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగశివన్నారాయణ అధ్యక్షత జరిగిన నిరసన ప్రదర్శనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, పెన్షనర్స్, ఎన్జీఓ నాయకులు పి.నాగరాజు, మూర్తి ప్రసంగించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం నుంచి లాడ్జి సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. నిరసన ప్రదర్శనలో జిల్లా జోనల్ నాయకులు పి.లక్ష్మీనారాయణ, జి.దాస్, చక్క వెంకటేశ్వరావు, సాయి లక్ష్మీ, వేణు, పి.శివరామకృష్ణ, బాలరాజు, కిరణ్, గురుమూర్తి సిద్ధిక్, లక్ష్మి, రమాదేవి, నిర్మల, నరసింహారావు, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

లక్ష్మీపురం: దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలతో పాటు సైబర్ మోసాలు బాగా పెరిగాయని, వీటి నివారణకు బ్యాంకు ఖాతాదారులు పలు జాగ్రత్తలు వహించాల్సి ఉందని, ప్రధానంగా డిజిటల్ అరెస్ట్ అని ఆన్‌లైన్ ఫోన్‌లు చేసిన వాటిని నమ్మవద్దని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో డిజిటల్ అరెస్ట్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐటీ కోర్ సీఐ సమీర్ బాషా మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరిగి మీ ఖాతాలలో డబ్బులు పోయినట్లు గుర్తించిన వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టాభిపురం ఎస్ఐ తరంగిణి, ప్రదీప్ పాల్గొన్నారు.

కవిత్వంతో కాసేపు



నగరంపాలెం: స్థానిక ఎస్‌వీఎన్‌కాలనీలోని సరస్వతిపుత్ర డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు స్వగృహంలో సోమవారం సాయంత్రం గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రతి మాసం నిర్వహించే కవిత్వంతో కాసేపు కార్యక్రమం నిర్వహించారు. తొలుత నానా యువ కవి వశిష్ఠ సోమేపల్లి రచించిన ఆకు రాలిన చప్పుడు కవితా సంపుటిని పరిచయం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు పద్య గానం చేసి అలరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ఎం. సుభాని, డాక్టర్ సుధీర్‌కుమార్, బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి, పింగళి గిరిభూషణ్‌రావు, నానా, జమదగ్ని మార్కండేయులు, పాణిరావు, వశిష్ఠ సోమేపల్లి, గాంధీరాజు, ఎస్.విజయలక్ష్మి, సోమేపల్లి విజయలక్ష్మి, ఎం.సుభద్రకృష్ణ, పింగళి భాగ్యలక్ష్మి, భూసురపల్లి విజయ పాల్గొన్నారు.

ప్రజలను ఆదుకోవాలి

లక్ష్మీపురం: నగరంలో ఆదివారం కురిసిన భారీ వర్షం వలన ఇబ్బందులు పడతున్న ప్రజలను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు విన్నవించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు.

మూత్ర సంబంధ వ్యాధులపై పరిశోధనలకు ఒప్పందం

రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జి.నందకిషోర్

గుంటూరు మెడికల్: ప్రజారోగ్య పరిరక్షణలో దీర్ఘకాల మూత్ర వ్యాధులు ముఖ్యంగా దీర్ఘకాల యూరిన్ ఇన్ఫెక్షన్లు చాలామందిలో ప్రధాన ఆరోగ్య సమస్యగా మారాయని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ అన్నారు. సోమవారం గుంటూరు ఐఎంఏ హాలులో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ శాఖ, యూఎస్ సంస్థ ఇప్సైటి రీసెర్చ్ సెంటర్‌తో పరిశోధనలకు అంగీకారం కుదుర్చుకున్నట్లు ఆయన వెల్లడించారు. సంస్థ ప్రతినిధులతో అంగీకార ఒప్పంద పత్రాలపై ఇరువురు సంతకాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐఎంఏ వైద్యులు ఈ పరిశోధనలకు సహకరించాలని డాక్టర్ నందకిషోర్ విజ్ఞప్తి చేశారు. ఇప్సైట్ రీసెర్చ్ సెంటర్ సీఈఓ డాక్టర్ సందీప్ నాదెండ్ల మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తిగా స్వరాష్ట్ర అభిమానంతో అత్యాధునిక వైద్య పరీక్షలు, పరిశోధనలు మన రాష్ట్ర ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. క్లినికల్ ఇన్‌ఫెక్షన్స్ డిసీజెస్ సొసైటీ (సీట్స్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కోగంటి కళ్యాణ చక్రవర్తి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ, ఏఎంఆర్ కమిటీ చైర్మన్ డాక్టర్ పి.ఎస్.శర్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి .సేవ కుమార్, ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, కార్యదర్శి డాక్టర్ బి.సాయికృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

పట్నంబజారు: ఫిట్స్‌తో వ్యక్తి కాలువలో పడి మృతిచెందిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. 13వ డివిజన్ మంత్రి వారివీధి, బ్రహ్మంగారి గుడిపక్కన నివాసం ఉండే పి.వెంకటేశ్వర్లు (35) ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న కాలువలో పడ్డాడు. స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ స్టేడియం వద్ద ఆటో డ్రైవర్ల నిరసన



లక్ష్మీపురం: ప్రభుత్వం అర్హులైన ప్రతి ఆటో డ్రైవర్‌కు వాహన మిత్ర పథకం అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ డిమాండ్ చేశారు. గుంటూరు బీఆర్ స్టేడియం వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు భారంగా మారిన జీఓ నంబర్ 21, 31 లను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంగ శ్రీనివాసరావు, ఆకిటి అరుణ్ కుమార్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆటో సంఘం నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, సహాయ కార్యదర్శి మహమ్మద్, బాబర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఆటో యూనియన్ నాయకులు,రజాక్, గఫారి, కొండ, జయరాం, సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ–4 డీఈఈ పీహ్చా ఖాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. నందివెలుగు రోడ్, పైపులు రోడ్, రాహుల్‌గాంధీ నగర్, జియావుద్దీన్ నగర్, షాప్ ఎంప్లాయీస్ కాలనీ, ఎల్‌బీ నగర్, వెంకటేశ్వర కాలనీ, పోలీస్ ప్లాట్స్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్



గుంటూరు మెడికల్: లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే సందర్భంగా ఏపీపీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్–అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ సభ్యుల కోసం జిల్లా పరిషత్ ప్రాంగణంలో సోమవారం ఉచిత మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. క్యాంపులో ఉచితంగా రక్తపోటు, చక్కెర, ఈసీజీ పరీక్షలు, ఫిజియోథెరపీ కన్సల్టేషన్ వంటి సేవలు అందించారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ పి.అజయ్ మానసిక ఆరోగ్యం, డిప్రెషన్, ఆందోళనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

సీతారామయ్య స్కూల్ విశ్రాంత హెచ్‌ఎం మృతి



కె. వెంకట్రావు (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కొండబోలు వెంకట్రావు(73) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సీతారామయ్య పాఠశాలతో పాటు నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీలో పాలకవర్గ సభ్యుడిగా, డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ గౌరవ సంయుక్త కార్యదర్శిగా కొనసాగుతున్నారు. వెంకట్రావు ఆకస్మిక మృతికి దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు పాటిబండ్ల విష్ణువర్ధన్, డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఆయన కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేశారు. వెంకట్రావు అంతిమయాత్ర మంగళవారం ఉదయం 9.00 గంటలకు సిద్ధార్థనగర్‌లోని స్వగృహం నుంచి స్తంభాలగరువులోని మహా ప్రస్థానానికి బయలుదేరుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

అంబటితో నాయకుల మర్యాదపూర్వక భేటీ



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబును పార్టీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దాసరి కత్తిరేణమ్మ సమావేశమయ్యారు. సిద్ధార్థనగర్‌లోని ఆయన కార్యాలయంలో సోమవారం దుశ్శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈసందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి మహిళల బలం ఉందన్నారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో మహిళలకు పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. భవిష్యత్‌లో పార్టీని బలోపేతం చేయడంతోపాటు, కమిటీలను త్వరితగతిన పూర్తి చేసేలా దృష్టి సారించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఎం.శివరామిరెడ్డి, ఉడుముల పిచ్చిరెడ్డి, పఠాన్ సైదా ఖాన్, దానం వినోద్, ఎంపీటీసీ అనురాధ, షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ సైదులు, సాల్మాన్, కె.అప్పిరెడ్డి, చెవూరి రామోహన్‌రెడ్డి, బోడపాటి అంజిరెడ్డి, సురేష్, హేమలతారెడ్డి, తుపాకుల కృష్ణ, మోరంరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొమ్మురెడ్డి ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్



గుంటూరు మెడికల్: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను సోమవారం రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, సీనియర్ నాయకులు ఈమని మాధవరెడ్డి, యువమోర్చా నాయకులు జంధ్యాల సాయి రాధాకృష్ణ ఉన్నారు.

రేపటి నుంచి స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్' (ఆరోగ్య వంత మైన మహిళ – శక్తి వంత మైన కుటుంబం) అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. ఈమేరకు సోమవారం ఆమె మీడియాకు వివరాలు వెల్లడించారు. 'స్వస్థ నారి స్వశక్తి పరివార్ అభియాన్' కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు మహిళ ఆరోగ్యం పై అవగాహన పెంచడం, మహిళలకు సమయానుకూల వైద్య సేవలు అందించడం, పోషకాహారాన్ని ప్రోత్సహించడం, కుటుంబాలను స్వశక్తి చేయడం అని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా జరిగే వైద్య శిబిరాలను ప్రజలందరూ వినియోగించుకోవాలని డాక్టర్ విజయలక్ష్మి కోరారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



లక్ష్మీపురం: 104 మొబైల్ మెడికల్ యూనిట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌అహ్మద్‌కు యూనియన్ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్షులు గోరంట్ల సురేష్ మాట్లాడుతూ భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం నుంచి ఉద్యోగులకు తగ్గించిన వేతనాలతో సహా చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉద్యోగుల వేతనాలు పెంచాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యూనియన్ కోశాధికారి నాగులు, ఎం.సురేష్ పాల్గొన్నారు.

భారత రాజకీయాలపై చర్చ

లక్ష్మీపురం: భారత దేశ ప్రజాస్వామ్యంలో కుటుంబ రాజకీయాలు బలంగా పాతుకుపోయాయని, జనం నెత్తిన వారసత్వాన్ని రుద్దే పరిస్థితి దేశ వ్యాప్తంగా కొన్ని కుటుంబాల గుప్పిట్లో ప్రజాస్వామ్యం బందీగా మారిందని, సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చర్చా గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు. విశ్లేషకులు వి.వి.రావ్ మాట్లాడుతూ పార్టీల్లోనూ అంతర్గత ప్రజాస్వామ్యం దెబ్బతింటుందని, ప్రతిభ కంటే వారసత్వానికే ప్రాధాన్యం పెరుగుతుందన్నారు.

వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు
తోటి న్యాయవాద మిత్రులకు, శ్రేయోభిలాషులకు వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు తెలియజేస్తూ....
కళ్లం వెంకట రమణారెడ్డి
అడ్వకేట్
Special Public Prosecutor (Ex)
సెల్: 89787 77019

వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, జ్యుడీషియల్ సిబ్బందికి న్యాయపరిరక్షలకు, న్యాయవాద గుమాస్తాలకు, కక్షిదారులకు
నారదాసు వీర మణీంద్ర బాబు
Guntur Bar Association
సెల్: 98858 34560

వరల్డ్ లా డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, జ్యుడిషియల్ సిబ్బందికి, న్యాయవాద గుమాస్తాలకు
వరల్డ్ లా డే శుభాకాంక్షలు
సి.డి.భగవాన్ B.A. LL.B.,
అడ్వకేట్
ఆఫీస్: డోర్ నెం. 7-11-200/ఎ, అరండల్‌పేట, 4వలైను ఎదురు, గుంటూరు-522002
సెల్: 9440214578, 9966158338

వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు
మా మిత్రుడు, శ్రేయోభిలాషి, న్యాయవాది, మాజీ స్పెషల్ ప్రాసిక్యూటర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రబార్ కౌన్సిల్ సభ్యులు, చైర్మన్ డిసిప్లినరీ కమిటీ
శ్రీ వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి గారికి
వరల్డ్ "లా" డే శుభాకాంక్షలు
కనగాల సత్యనారాయణ
అంకిరెడ్డిపాలెం, గుంటూరు.

వరల్డ్ లా డే శుభాకాంక్షలు
న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, జ్యుడిషియల్ సిబ్బందికి, న్యాయవాద గుమాస్తాలకు
వరల్డ్ లా డే శుభాకాంక్షలు
డి.నాగబాబు B.A. LL.B.
సెల్: 9440759153, 9493824009

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com